# ఆక్రందన:

ఆయపిళ్ల సత్యనారాయణమూర్తి

★

వెలుతురు గాలి వచ్చిపోయే ఆ ఒక్క వెదురు తడికా మూసి, సొమ్మసిల్లి పడివున్న ఎల్లిని ఒళ్ళోకి తీసుకుని చూచున్నాడు మల్లాయి. అతని గుండెల్లో పెద్ద రాళ్ళు పడ్డాయి.

హైదరాబాదు పరిసరప్రాంతం పల్లెలో పుట్టి పెరిగాడు మల్లయ్య, భూస్వాముల దొడ్లలో పాలికాపుగా గంజినీళ్ళు తాగి కాలం గడుపుతున్నాడు. కొత్తగా ఎల్లితో స్నేహంకూడ చేసుకున్నాడు.

ఇప్పుడు యీ విచిత్రం—ఘోరం తలచుకుంటూంటె గుండెలు పగిలిపోతున్నయి!

దుండగీడులు ఇళ్ళు మంటలు పెట్టేస్తున్నా. కనిపించిన ఆమాయిక జీవాలను నిలువుపాటున తెగనరుకుతున్నారు. ధనాన్ని దోచుకుంటున్నారు. అగుపడ్డ ఆడదాన్నల్లా చెరుకుపిప్పి చేసి విడిచిపెడుతున్నారు.

ఎంత ఘోరం! పట్టపగలు!

ఒకప్పుడు మల్లాయ చిన్నతనంలో ఒక దొంగతనం జరిగింది. దొంగ దొరికినాడు. పోలీసులొచ్చి కూపీలు తియ్యటానికి మనుషుల్ని లాఠీలతో బాదినారు.

ఇప్పుడింత ఘోర నరకం జరిగిపోతోంది. సొరాజ్యంలో పట్టపగలు!! ఒక పోలీసువాడూ రాడు! ఒక అబ్బా అడ్డు పడ్డు!!

తను ఒక్కడూ ఎల్లాగో గుడిశప్రాంతకు చేరుకున్నాడు, ఆ రాక్షసకృత్యాల్లోంచి, ఆ మండిపోయే మంటల్లోంచి ఎగురుకునివచ్చి తను ఒక్కడూ బయటపడి ప్రాణాలను తెగించుకుని పరుగెత్తి కొండావరికి చేరుకున్నాడు పొలం గట్టుమీది కొంపకాడికి!

వచ్చి చూసుకుంటే—గుండె పగిలిపోయే దృశ్యం! "గుడిశ" మూలల్లో పడివుంది ఎల్లి, వొంటిమీద స్మారకం తప్పి.

వెలుతురూ గాలి వచ్చిపోయే ఆ వొక్క వెదురు తడిగా మూసి సొమ్మసిల్లి పడివున్న ఎల్లిని ఒళ్ళోకి తీసుకుని కూర్చున్నాడు మల్లాయి. అతని గుండెల్లో పెద్ద రాళ్ళు పడ్డయి.

ఎల్లి తెప్పరిల్లి కేకలు పెట్టింది.

"ఒద్దు—నన్ను తాకవోకండి—నా ప్రాణాలు రక్షించండి—నా మానాలు కాపాడండి" అని.

మల్లాయ నిబ్బరం యిస్తూ

"నేను మల్లాయన్నా! ఏంది అట్లా కేకలిడతావు? అన్నాడు. ఎల్లి లేచి—మల్లాయ బాహు సందిట్లో తల దూర్చి వెక్కి వెక్కి ఏడ్చింది.

"ఏందే అట్లాగా?" అని అడిగాడు మల్లయ్య

"పొలాల్లో పని చేసుకుంటూవుంటేనూ ఎటకాళ్ళల్లె వచ్చారయ్యా. ఈ రజాకార్లూ కత్తులు కటార్లూ ఝళిపించారు. ఆడోళ్ళంకదా! పరువు తెత్తిపోతే అడ్డగించారు. దొరికిన ఆడదానల్లా యాటాడారు మృగాల్లాగ! ఒంటిమీద బట్ట లొలిచి చెట్టులకు కట్టి—అబ్బా! ఏం జెప్పేది! ఆళు మనుషులు కారు మామా రాక్షసులె! ఇట్టా నే నొక్కర్తినూ ప్రాణాల్ని రక్షించుకుని పరుగులెత్తుకుని ఇక్కడ పడ్డాను. నా వెనకాల పదిమంది వెంటాడి తరుముకొచ్చారుకూడ". ఎల్లి గోలున ఏడిచింది.

మల్లయ్య ధయిర్యం యిచ్చాడు.

"ఏందట్టా చిన్న పిల్లలె!"

"మరేందిరా యీ దారుణం! ఈళ్ల సేతుల్లో పడి సవాలసిందే?" ఈ ముక్క అన్నాక ఎల్లి హృదయం కట్టలు తెగింది. భోరున ఏడవటం మొదలెట్టింది. మల్లాయి ఎల్లిని సముదాయిస్తూ కూచున్నాడు. రాత్రి పది గంటలు దాటింది.

తిరిగి దగ్గర్లోనె రాక్షస నినాదాలు వినిపించేయ్.

“ఖతం! ఖతం కర్లావ్! సాలాలోకా ఖతం కర్లావ్! తక్కారీ హల్వా బనావ్! మజా కర్లావ్!!”

ఎల్లీ, మల్లయ్యవున్న గుడిశమీద పడి, కర్రల్తో పూరిగుడిశను కొట్టి పడదోసి అగ్గి పెట్టిపోయారు దుండగీడులు.

ఎల్లీ, మల్లయ్య ప్రాణాలు తెగించుకుని బైట పడ్డారు.

రాక్షస సైన్యమంతా చాలదూరం పోయింది.

చుట్టూ ఇళ్లూ, మేడలూ, మహాసౌధాలూ మండిపోతూన్నాయి. కాల్తోవున్న జీవరాసుల దుర్గంధం భరించలేనంతగా వుంది. బ్రతికి బయటపడ్డ జీవరాసుల హాహాకారాలు వినలేనంత దైన్యంగా వున్నవి.

మల్లయ్య మనస్సేమీ తోచటంలేదు. ఈ నిప్పుల్లోంచి — పీనుగుల్లోంచి — మంటల్లోంచి బయటపడేదెట్లాగా? అన్న ఆలోచనలో మునిగి వున్నాడు.

ఊహించలేనంత వేగంగ తిరిగి రజాకార్లు ప్రవేశించారు. ఎల్లీ మల్లయ్య నీడలు ఆ నిశి రాత్రిలో మంటలముందు జీవాలలో స్పష్టంగా వాళ్లకి దృగ్గోచరమయ్యాయి.

మరేముంది.

తిరిగి పద్మవ్యూహంలో చిక్కుబడ్డారు.

మల్లయ్య ఒక్కడూ అయితే వీళ్లందరిమీద నుండీ ఎగిరి ఆ మంటలమధ్యనుండి మాయమయ్యేవాడే! కాని తనను కావలించుకుని కూచున్న ఎల్లిని విడిచేదెట్లా!

వంద కత్తులు లేచి మల్లయ్య వొళ్ళు తూట్లు-తూట్లు చేశాయ్! 'చిమ్మని' చిందిన రక్తంలో మునుగు మనుషులు వీరవిహారాలు చేశారు.

ఎల్లి నిరాధార అయ్యింది.

“నన్ను తాకవోకండి
నా ప్రాణాలను రక్షించండి
నా మానాలను కాపాడండి”

అన్న ఆర్తనాదంమట్టుకు ఆ మహా ఘోర రాక్షసమూక మధ్యలోంచి దేశం ఒల్లా చిచ్చు పెట్టేస్తోంది.

# వ్యాసకర్తలకు:

★

- రచనావ్యాసంగానికి మీరు క్రొత్తవారే కావచ్చు. వినా లోకానికి తెలపవలసిన కొన్ని క్రొత్త విషయాలు మీలో ఊర కలువేస్తూ వుండి వుంటాయి. కాబట్టి ఎట్టి సంకోచమూ లేకుండా ఉత్సాహంతో ప్రయత్నించి మీ రచన మాకు పంపండి. ఏమాత్రం బాగున్నా సవరించి ప్రచురించటానికే సాధ్యమైనంతవరకు ప్రయత్నిస్తాము.
- హాస్యప్రధానమైన వ్యాసాలకు ఆనందవాణి ప్రాధాన్యమిస్తుంది.
- తప్పనిసరి ఐతేకాని రచనలలో ఇంగ్లీషు పదాలు వాడకూడదు.
- వినోదము కలిగించే విజ్ఞానదాయకమగు చిన్న చిన్న రచనలయితే వేగంగా ప్రచురింప వీలవుతుంది.
- క్రొత్త సమస్యలతో సంబంధించి, ప్రత్యేకమైన హాస్యభోగతీలో ఉంటే తప్ప పద్యవ్యాసములు పంపవద్దు.
- ప్రతి వ్యాసంతోనూ ముందుగాని పోస్టు బిళ్లలు పంపితేనే ప్రకటించే పక్షాన తెల్పడానికీ, నచ్చకపోతే వాపసు చేయటానికీ వీలవుతుంది. కాగితాలు ఒకేపర్చవద్దు.
- ప్రతివ్యాసముననూ వ్యాసకర్త పూర్తి చిరునామా ఉండాలి.
- సరసమయిన ఊహాలు కల్గి, వినోదింపజేసే వ్యంగ్యచిత్రాలనుకూడ ప్రచురణకు పంపవచ్చు.
- రచనలు, చిత్రాలు వ్యక్తుల పేర గాక — 'ఆనందవాణి' సంపాదకునకు 12 తంబుశెట్టి వీధి, పోస్టుబాక్సు నం. 1588 మదరాసు-' అని వ్రాయాలి. లేకుంటే వ్యాసపరిశీలనము ఆలస్యము కావచ్చు.

—సంపాదకుడు